నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I హైదరాబాద్, శనివారం 19 అక్టోబర్ 2024 HYDERABAD

# రిజిస్ట్రార్ ఆఫీసుకు కరెంట్ కట్

## అద్దె కట్టలేదని ఫ్యూజులు తొలగించిన యజమాని



సుల్తాన్‌బజార్, అక్టోబర్ 18:ఎనిమిది నెలలుగా అద్దె బకాయి చెల్లించకపోవడంతో యజమాని విద్యుత్ ఫ్యూజులు తీసుకుపోయాడు. దీంతో శుక్రవారం రెడ్‌హిల్స్‌లోని హైదరాబాద్ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం అంధకారంలో మగ్గిపోయింది. రిజిస్ట్రేషన్ కార్యకలాపాలకు ఆటంకం కలిగింది. చేసేది లేక ఉద్యోగులు యజమానిని కలిసి.. త్వరలోనే భవనాన్ని ఖాళీ చేస్తామని, ఇందుకు పేపర్ నోటిఫికేషన్ ఇస్తామని హామీ ఇచ్చారు. దీంతో సదరు భవన యజమాని విద్యుత్ ఫ్యూజులు తిరిగి బిగించడంతో కరెంటు సరఫరా ప్రారంభమైంది. ఈ విషయమై సబ్ రిజిస్ట్రార్-1 శ్రీనివాస్‌ను వివరణ కోరగా, 8 నెలలుగా భవనం అద్దె బకాయి ఉందని, ఇటీవల రెండు నెలల అద్దె 3 లక్షల రూపాయలకు సంబంధించిన బిల్లు మంజూరైందన్నారు.

# చెక్కుల పంపిణీకి.. పొన్నం డుమ్మా!

సిటీబ్యూరో: ప్రజాభవన్‌లో శుక్రవారం ఉదయం 11 గంటలకు మూసీ రిహాబిలిటేషన్‌లో భాగంగా బాధితులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని అధికారులు ప్రకటించారు. ఆ మేరకు లబ్ధిదారులను రప్పించారు. అయితే చెక్కులు అందించేందుకు మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క ఎప్పుడొస్తారో తెలియక అధికారులు, లబ్ధిదారులకు ఎదురు చూపులు తప్పలేదు. మంత్రులు వచ్చే వరకు లబ్ధిదారులతో సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజ్, మూసీ జేడీఏం గౌతమి మాట్లాడే ప్రయత్నం చేశారు. అక్కడికి వచ్చిన వారంతా గూడు కోల్పోయిన ఆవేదననే వారికి వివరించారు. ఒకే డబుల్ బెడ్రూంలో ఉండలేకపోతున్నామంటూ ఓ మహిళ కన్నీటిపర్యంతమైంది. కాగా, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కార్యక్రమానికి డుమ్మా కొట్టారు. మంత్రి సీతక్క మధ్యాహ్నం కార్యక్రమానికి హాజరయ్యారు. లబ్ధిదారులకు అందించాల్సిన చెక్కులను గ్రూపు లీడర్లకు అందించారు. మూసీ ఇండ్లు కోల్పోయిన వారి కుటుంబాల పిల్లలకు స్కూల్ యూనిఫాం, బుక్స్ పంపిణీ చేయాల్సి ఉండగా డీఈఓ తీసుకొచ్చిన 11 మంది విద్యార్థుల్లో కేవలం ఆరుగురికే పంపిణీ చేసి మంత్రి సీతక్క కార్యక్రమాన్ని ముగించారు.






# ఢిల్లీకి మూటల కోసమే..
# లక్షన్నర కోట్ల మూసీ

## కేటీఆర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్



ఢిల్లీకి మూటలు పంపేందుకే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం లక్షన్నర కోట్ల మూసీ ప్రాజెక్టును చేపడుతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. కేవలం రూ.25 వేల కోట్ల వ్యయంతో మూసీ ప్రాజెక్టును పూర్తి చేయవచ్చని, కానీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం లక్షన్నర కోట్లతో ఈ ప్రాజెక్టును ఎందుకు చేపడుతున్నదో ప్రజలకు చెప్పాల్సిన అవసరమున్నదని డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణభవన్‌లో కేటీఆర్ మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుకు సంబంధించి బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన పనులు, రూపొందించిన ప్రణాళికల వివరాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ రూపంలో వివరించారు.

వివరాలు మెయిన్‌లో..

-సిటీబ్యూరో, అక్టోబర్ 18 (నమస్తేతెలంగాణ)

# బిగ్ బ్రదర్స్ దందాపై హాట్ హాట్‌గా చర్చ

### విచారణకు ఆదేశించిన జోనల్ కమిషనర్

### నేడు నివేదిక అందించనున్న అధికారులు

**నమస్తే ఎఫెక్ట్**

సిటీబ్యూరో, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్‌లో 'బిగ్ బ్రదర్స్' పేరిట జరుగుతున్న దందాపై ఉద్యోగుల్లో హాట్ హాట్ చర్చ జరిగింది. శేరిలింగంపల్లి సర్కిల్‌కు చెందిన చైన్‌మెన్ అక్రమ వసూళ్లకు పాల్పడుతూ రూ. కోట్లకు పడగలెత్తాడు. అక్రమ నిర్మాణాలను లక్ష్యంగా చేసుకుని అందినంత దండుకుంటూ సర్కిల్‌లో విచ్చలవిడిగా అవినీతికి తెర లేపాడు. సంస్థ పరమైన లోపాలను ఆసరాగా చేసుకొని అక్రమాలకు పాల్పడ్డాడు. రాఘవేంద్ర కాలనీ, రాజరాజేశ్వరీ నగర్, అంజయ్య నగర్, సిద్ధిఖ్‌నగర్‌లో ఈ చైన్‌మెన్ బాధితుల్లో కొందరు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన సందర్భాలున్నాయి. ఈ క్రమంలోనే ఇటీవల మాదాపూర్ కాపూరి హిల్స్ ఫేజ్- 2 రోడ్డులోని దాదాపు 1000 గజాల స్థలంలో ఓ వ్యాపారస్తుడు సెకండ్ హ్యాండ్ కార్ సేల్స్ వ్యాపారానికి షెడ్డు వేసుకునేందుకు ప్రయత్నించగా...ఈ వ్యాపారస్తుడి వద్దకు జేసీబీతో వచ్చి హల్‌చల్ చేసి రూ.30 లక్షలు డిమాండ్ చేసిన చైన్‌మెన్..చివరకు రూ.10 లక్షలకు బేరం కుదుర్చుకుని ఆ నిర్మాణం జోలికి వెళ్లలేదు. దీనిపై శుక్రవారం 'నమస్తే తెలంగాణ'లో 'బిగ్ బ్రదర్స్ పేరిట చక్రం తిప్పుతున్న చైన్‌మెన్ వ్యవహారంపై ప్రత్యేక కథనాన్ని ప్రచురించగా...స్పందించిన శేరిలింగంపల్లి జెడ్సీ ఉపేందర్‌రెడ్డి జోన్ టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో కొందరు తీరుతో చెడ్డ పేరు వస్తుందని, పనితీరు మార్చుకోవాలని జెడ్సీ మందలించారు. చైన్‌మెన్ వ్యవహారాలను నిగ్గు తేల్చాలంటూ డీసీ ముకుందరెడ్డి, ఏసీపీ రమణ కుమార్‌లను ఆదేశించారు. శనివారం(నేటి)లోగా విచారణ పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని విచారణ అధికారులను జెడ్సీ ఆదేశించారు. కాగా, మాదాపూర్ కాపూరి హిల్స్ ఫేజ్- 2 రోడ్డులోని దాదాపు 1000 గజాల స్థలం విషయంలో అక్రమ నిర్మాణం ఎవరు కట్టారు? ఇందులో ఎవరెవరి ప్రమేయం ఉందని నిగ్గు తేల్చేందుకు విచారణాధికారులు శనివారం ఉదయం సంబంధిత ప్రాంతాన్ని సందర్శించనున్నారు. వివిధ అంశాలపై ఆరా తీయనున్నారు.




# ఉరుముతున్న ఉత్తర సిటీ

## మెట్రో సాధనకు ఉద్యమం ఉధృతం

### 5 మెట్రో మార్గాలు వేయాలి

### మేడ్చల్ మెట్రో సాధన సమితి డిమాండ్

### వేలాది మందితో సంతకాల సేకరణ




సిటీబ్యూరో: ఉత్తర హైదరాబాద్ ప్రాంతానికి మెట్రో కావాలంటూ చేపట్టిన ఉద్యమం ఉధృతంగా కొనసాగుతున్నది. రేవంత్ సర్కారు రెండోదశలో ప్రతిపాదించిన మెట్రో మార్గాల్లో ఉత్తర హైదరాబాద్‌కు మొండి చెయ్యి చూపడంతో ఆ ప్రాంతం వాసులంతా ఒక్కటయ్యారు. మేడ్చల్ మెట్రో సాధన సమితి పేరుతో ఉత్తర హైదరాబాద్ ప్రాంతానికి మెట్రో సాధించడమే ప్రధాన లక్ష్యంగా తమ ఉద్యమ కార్యాచరణను కొనసాగిస్తున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రెండు మార్గాల్లో మెట్రో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందులో ప్రధానంగా సికింద్రాబాద్ పార్యడైజ్ నుంచి బోయిన్‌పల్లి మీదుగా మేడ్చల్-కండ్లకోయ, సికింద్రాబాద్ జేబీఎస్ నుంచి అల్వాల్ మీదుగా శామీర్‌పేట ఓఆర్ఆర్ వరకు డబుల్ డెక్కర్ రోడ్డు కమ్ మెట్రో బ్రిడ్జీ నిర్మాణానికి ప్రతిపాదించారు. ఉత్తర హైదరాబాద్ ప్రాంతానికే కాకుండా ఉత్తర తెలంగాణ ప్రాంతానికి కీలకమైన హైదరాబాద్-నాందేడ్ జాతీయ రహదారి, కరీంనగర్ రాజీవ్ రహదారి వంటి మార్గాలపై ఉన్న ట్రాఫిక్ నేపథ్యంలో మెట్రో నిర్మాణం అత్యవసరమని ట్రాఫిక్ నిపుణులు చెప్పారు. వీటన్నింటినీ పక్కన పెట్టి కాంగ్రెస్ ప్రభుత్వం రెండో దశలో ఉత్తర హైదరాబాద్ ప్రాంతానికి ఒక్క మెట్రో మార్గాన్ని ప్రకటించలేదు. దీంతో ఆగ్రహం చెందిన ఆ ప్రాంతవాసులంతా ఒక్కటై ఉద్యమానికి తెరతీశారు. జన సాంద్రతతో పాటు వ్యాపార, వాణిజ్యపరంగా ఎంతో అభివృద్ధి చెందిన ఉత్తర ప్రాంతానికి మెట్రో మార్గాలను సాధించే వరకూ ఈ ఉద్యమం కొనసాగుతుందని, విద్యార్థులు, ఉద్యోగులతో పాటు అన్ని వర్గాలతో కలిసి పనిచేస్తున్నామని మేడ్చల్ మెట్రో సాధన సమితి సభ్యులు సంపత్‌రెడ్డి పేర్కొన్నారు.

### ఆన్‌లైన్ వేదికగా ఉధృతంగా ఉద్యమం

ప్రజలు సామూహికంగా తమకు కావాల్సిన డిమాండ్లను నేరవేర్చుకొనేందుకు ఆన్‌లైన్‌ను వేదికగా చేసుకొని ఉద్యమిస్తున్నారు. ప్రస్తుతం మేడ్చల్ మెట్రో సాధన సమితి సైతం ఆన్‌లైన్‌లో చేంజ్.ఓఆర్జీ (www.Change.org) వేదికగా తమ డిమాండ్లను సంబంధిత సంస్థలకు, వ్యక్తులకు చేరేలా చేస్తున్నారు.అదే తరహాలో మేడ్చల్ మెట్రో సాధన సమితి ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, హైదరాబాద్ మెట్రో రైల్ కార్పొరేషన్లకు తమ డిమాండ్లను పిటిషన్ల రూపంలో వారికి చేరేలా చేస్తున్నది. ఇదే వేదికగా 25వేల మందితో సంతకాల సేకరణ చేపట్టగా, ఇప్పటి వరకు 20వేల సంతకాలు చేశారని మెట్రో సాధన సమితి సభ్యులు సంపత్‌రెడ్డి తెలిపారు.

**మెట్రో సాధన సమితి కోరుతున్న మార్గాలు..**

- ప్యారడైజ్- తాడ్‌బండ్-బోయిన్‌పల్లి చెక్‌పోస్టు- మిలిటరీ డెయిరీ ఫామ్- సుచిత్ర, ఎన్‌సీఎల్ నార్త్, కొంపల్లి సినీ ప్లానెట్- గుండ్లపోచంపల్లి- అయోధ్య సర్కిల్, కండ్లకోయ-మేడ్చల్ చెక్‌పోస్టు-మేడ్చల్-అత్వెల్లీ వరకు.
- సికింద్రాబాద్ జేబీఎస్- తిరుమలగిరి- అల్వాల్ - బొల్లారం- తూంకుంట- శామీర్‌పేట-అలియాబాద్.
- కూకట్‌పల్లి వై జంక్షన్-బాలానగర్- బోయిన్‌పల్లి-సుచిత్ర.
- కూకట్‌పల్లి వై జంక్షన్- బాలానగర్ మీదుగా చింతల్ -షాపూర్, కుత్బుల్లాపూర్- సుచిత్ర-కొంపల్లి.
- బాలానగర్ చౌరస్తా నుంచి చింతల్ - షాపూర్-జీడిమెట్ల ఐడీఏ- సూరారం- బహదూర్‌పల్లి- గండిమైసమ్మ చౌరస్తా వరకు.

# ఓయూ ఠాణా.. ఇష్టారాజ్యం!

### నిత్యం ఏదో ఒక వివాదం

### సీఐ వ్యవహారంపై గతంలో డీజీపీకి ఫిర్యాదు

### చర్యలు శూన్యం.. మళ్లీ చెలరేగిపోయిన వైనం

సిటీబ్యూరో:ఉస్మానియా యూనివర్సిటీ ఠాణాలో పోలీసుల తీరు ఇష్టారాజ్యంగా మారింది. మేం ఏమి .. నడుస్తుందనే భావనతో అక్కడి అధికారులు వ్యవహరిస్తున్నారు. గతంలో నిరుద్యోగుల ఆందోళనలను కవర్ చేస్తున్న జర్నలిస్ట్‌లపై అక్కడి ఇన్‌స్పెక్టర్ దౌర్జన్యం చేశారు. అటు నిరుద్యోగులను, ఇటు జర్నలిస్ట్‌లపై నోరు పారేసుకోవడంతో ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో జర్నలిస్ట్‌లు డీజీపీకి ఫిర్యాదు చేశారు. అయితే ఈ ఫిర్యాదుపై ఉన్నతాధికారులు ఏ మాత్రం స్పందించకపోవడంతో తాము ఆడిందే ఆట.. పాడిందే పాటగా ఉస్మానియా ఠాణా అధికారులు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. పొలిటికల్, పోలీసులు ఒక్కటై మామూళ్ల కోసం చెలరేగిపోయి అమాయకులపై బుధవారం ఠాణాలో దౌర్జన్యానికి పాల్పడిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఇటీవల విద్యార్థి సంఘం నాయకులపై ఏక పక్షంగా కేసులు పెట్టి జైలుకు పంపించారనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఉస్మానియా యూనివర్సిటీ ఠాణా అధికారులు, సిబ్బందితో వేధింపులకు గురైన వారు ఉన్నతాధికారులను ఆశ్రయిస్తున్నారు.

### ఏకపక్షంగా కేసులు...

ఇటీవల యూనివర్సిటీలో ఫ్లెక్సీల విషయంలో వివాదం జరిగింది. అధికార పార్టీకి చెందిన వారిపై ఈగవాలనీయకుండా, ఠాణా పోలీసులు మరో విద్యార్థి సంఘం నాయకులందరిపై కేసులు పెట్టి జైలుకు పంపించారనే ఆరోపణలున్నాయి.

### కరెంట్ పోయిందా..? పోగొట్టారా..?

యూనివర్సిటీ ఠాణాలో గురువారం కరెంట్ లేదని అధికారులు చెబుతున్నారు. అమాయకులను చితకబాదడంతో అందులో ఉన్న సీసీ కెమెరాలు పనిచేయకుండా కరెంట్ కట్ చేశారా? అనే అనుమానాలు కలుగుతున్నాయి. ఈ విషయంపై ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామితో మాట్లాడగా, గురువారం ఠాణాలో కరెంట్ లేదని, దీనివల్ల సీసీ కెమెరాలు కూడా పనిచేయలేదని సిబ్బంది చెప్పారన్నారు.



# ప్రజారోగ్యంతో చెలగాటం

### 7 క్వింటాళ్ల కుళ్లిన చికెన్ స్వాధీనం

### బాలయ్య చికెన్ సెంటర్ సీజ్

సిటీబ్యూరో/బేగంపేట, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీ ఫుడ్‌సేఫ్టీ అధికారులు, ఉత్తర మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా సికింద్రాబాద్ బేగంపేట ప్రకాశ్‌నగర్‌లోని బాలయ్య చికెన్ సెంటర్‌లో శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కుళ్లిపోయిన 7 క్వింటాళ్ల చికెన్‌తో పాటు కొవ్వు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఇలా కుళ్లిపోయిన నిల్వ ఉన్న కోడి మాంసంలో కెమికల్ కలిపి నగరంలోని జనతాబార్, వైన్‌షాపుల ముందు మందుబాబులకు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, కల్లుదుకాణాలు, పబ్‌లు, రెస్టారెంట్‌లకు సరఫరా చేస్తున్నట్టు అధికారులు గుర్తించారు. బాలయ్య చికెన్ సెంటర్‌ను సీజ్ చేసి నిర్వాహకులపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కొండాపూర్‌లోని శరత్ సిటీ మాల్ అల్పాహార్ టిఫిన్స్ కేంద్రంలో డస్ట్‌బిన్లు తెరిచి ఉన్నట్లు గుర్తించారు. చట్నీ హోటల్‌లో ఆహార సరుకులు నిల్వ చేసే ప్రాంతంలో బొద్దింకలు, గోధుమ పిండిలో పురుగులు , ఉల్లిపాయలు, క్యాబేజీ పూర్తిగా పాడైనట్లు గుర్తించారు.

# పటాకుల దుకాణాలకు 24లోపు దరఖాస్తు చేసుకోండి

### సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి



సిటీబ్యూరో, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ): దీపావళి పండుగ నేపథ్యంలో సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఏర్పాటు చేసే పటాకుల దుకాణాలకు సంబంధించి తాత్కాలిక లైసెన్స్ కోసం ఈనెల 24లోపు దరఖాస్తు చేసుకోవాలని సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాశ్ మహంతి క్రాకర్స్ వ్యాపారులకు సూచించారు. అనుమతి లేకుండా పటాకుల దుకాణాలను ఏర్పాటు చేసినా, విక్రయించినా చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పటాకుల దుకాణాలను ఏర్పాటు చేసుకునే వారు అగ్నిమాపక శాఖ నుంచి ఎన్ఓసీ తీసుకోవాలని, దుకాణం ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేస్తే జీహెచ్ఎంసీ నుంచి అనుమతి పొందాలని, ప్రైవేటు స్థలంలో అయితే సంబంధిత యజమాని నుంచి ఎన్ఓసీతో పాటు గతేడాది తీసుకున్న అనుమతి పత్రం, ఏర్పాటు చేయబోయే దుకాణానికి సంబంధించిన బ్లూ ప్రింట్ తదితర డాక్యుమెంట్లతో కూడిన దరఖాస్తు, రూ.600 చలాన చెల్లించిన రసీదును సంబంధిత జోనల్ కమిషనర్ కార్యాలయాల్లో నేరుగా దాఖలు చేయాలని సూచించారు.





# సమన్వయంతో పనిచేద్దాం

### జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి

సిటీబ్యూరో, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ) : అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి నగర ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి హెచ్ఓడీలకు సూచించారు. శుక్రవారం అన్ని విభాగాల హెచ్ఓడీలతో ఇంటరాక్టివ్ మీటింగ్ నిర్వహించారు. ఆయా విభాగాలు నిర్వహిస్తున్న పనులు, కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హెచ్ఓడీలు తమ శాఖల ద్వారా నిర్వహిస్తున్న కార్యకలాపాలను కమిషనర్‌కు వివరించారు. నగర ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా ఆయా విభాగాల అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని కమిషనర్ కోరారు. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, నగరవ్యాప్తంగా చెత్త సేకరణ ప్రక్రియ మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆయా విభాగాల హెచ్ఓడీలు తమ అనుబంధ శాఖలతో రెగ్యులర్‌గా సమీక్షలు నిర్వహించాలని కమిషనర్ సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్లు శివకుమార్ నాయుడు, స్నేహ శబరీష్, నళిని పద్మావతి, గీతా రాధిక, పంకజ, రఘు ప్రసాద్, వేణుగోపాల్ రెడ్డి, సామ్రాట్ అశోక్, యాదగిరి రావు, అలివేలు మంగతాయారు, సత్యనారాయణ, సరోజ తదితరులు పాల్గొన్నారు.

# ఎత్తని చెత్తకు బిల్లులు రెడీ?

### లెగసీ స్పెషల్ డ్రైవ్ పేరిట మరో దందా

సిటీబ్యూరో: వ్యర్థాల నిర్వహణలో జీహెచ్ఎంసీ అభాసుపాలవుతున్నది. అధికార పార్టీ కార్పొరేటర్లే బల్దియా విధానాలను తప్పుపడుతున్నారు. తాజాగా లెగసీ వెస్ట్ (పాత చెత్త) తొలగింపునకు స్పెషల్ డ్రైవ్‌కు బల్దియా శ్రీకారం చుట్టింది. తొలి విడత ఈ నెల 16 నుంచి 22 వరకు చేపట్టేందుకు రంగంలోకి దిగింది. తొలి రోజు హడావుడిగా కార్యక్రమాన్ని ప్రారంభించింది. కానీ చాలా సర్కిళ్లలో చెత్త తరలింపునకు వాహనాలు సమకూర్చలేదు. కొన్ని చోట్ల ఒక్క వాహనంతో సరిపెట్టారు. అదేమని అడిగితే రాంకీ సంస్థ ప్రతినిధులు వాహనాలు పంపలేదని క్షేత్రస్థాయిలో సమాధానాలు వస్తున్నాయి. కాగా, శుక్రవారం మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ స్పెషల్ డ్రైవ్ విధానంలో లోపాలను సరిదిద్దాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. అయితే అధికారులు మాత్రం ఈ నెల 21, 22 వ తేదీల్లో సీ అండ్ వ్యర్థాలు (భవన నిర్మాణ) తొలగిస్తామని చెబుతున్నారు. ఇదిలా ఉంటే సందెట్లో సడేమియాలా కొందరు చెత్తను ఎత్తకుండా ఎత్తినట్లు బిల్లులు పెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు కార్మిక వర్గాలు ఆరోపిస్తున్నాయి.

